అధికారులతో చర్చిస్తున్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

- గడువులోగా సరస్వతీ పుష్కరాల ఏర్పాట్లు పూర్తిచేయాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్
- కాళేశ్వరంలో క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన
- అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష

మహదేవపూర్ (కాళేశ్వరం), ఏప్రిల్ 23 : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాల పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం వద్ద వీఐపీ ఘాట్, సరస్వతీ మాత విగ్రహం ఏర్పాటు, 100గదుల సత్రం పనులను సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్లు సీరియస్‌గా తీసుకొని పనులను అనుకున్న సమయానికి పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో శాఖల వారీగా చేపట్టిన పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. పనుల పూర్తిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న 10రోజులు చాలా ముఖ్యమని, ప్రతి రోజు పనుల్లో ప్రగతి కనిపించాలన్నారు. పనుల పురోగతిని వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేయాలని సూచించారు. మే మొదటి వారం వరకు సరస్వతీ విగ్రహం ఏర్పాటు చేయాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె గడువు సమీపిస్తున్నందున రేయింబవళ్లు కష్ట పడి వేగంగా పూర్తిచేయాలని సూచించారు. మే మొదటి వారంలోగా ఏడు హారతి ప్లాట్ ఫార్మ్స్ కూడా పూర్తి చేయాలన్నారు. వచ్చేనెల 10వరకు పనులన్నీ పూర్తికావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వీఐపీ ఘాట్ వద్ద శాశ్వత మరుగు దొడ్లు, షవర్స్, భక్తులు బట్టలు మార్చుకునే గదులు 12లోగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భక్తులు నది వరకు వెళ్లడానికి అనువుగా అప్రోచ్ రోడ్డుతో పాటు వీఐపీ ఘాట్ వద్ద అదనంగా తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలని ఆర్డబ్ల్యూఎస్ ఈఈకి సూచించారు. అలాగే వీఐపీ ఘాట్ వద్ద 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతోపాటు 125 కేవీ జనరేటర్ సిద్ధంగా ఉంచాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఆర్జేసీ రామకృష్ణారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ సత్యనారాయణ, డీపీవో నారాయణరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, దేవాదాయ శాఖ ఈఈ కనక దుర్గాప్రసాద్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, ధార్మిక అడ్వైజర్ గోవింద రాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాయి ప్రకాశ్‌కు కన్నీటి వీడ్కోలు

అంతిమ యాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 23 : మండలకేంద్రానికి చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాశ్ హత్యకు గురి కాగా బుధవారం ఆయన అంతిమ యాత్ర గ్రామంలో నిర్వహించారు. వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని కన్నీటితో వీడ్కోల్ పలికారు. అతన్ని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికి సుపరిచితుడు కావడంతో ఆయన మృతదేహాన్ని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలివచ్చారు.

ప్రపంచ పర్యాటకులను ఆకర్శించేలా ఏర్పాట్లు చేయాలి

- మే14న రామప్పకు వివిధ దేశాల సుందరీమణులు
- కలెక్టర్ టీఎస్ దివాకర
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలన

రామప్పలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ దివాకర, అధికారులు

వెంకటాపూర్, ఏప్రిల్ 23 : వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు మే 14వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయం, హరితహోటల్, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్లలో జరుగుతున్న పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో నిర్వహించే ప్రపంచ సుందరీమణుల పోటీల్లో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు రామప్ప దేవాలయాన్ని సందర్శించనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రామప్ప పరిసర ప్రాంతాన్ని స్వాగత తోరణం, ఆలయాన్ని లైటింగ్స్‌తో ముస్తాబు చేయాలన్నారు. గ్రీనరీ పెంచాలని, స్వాగత ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రపంచ దేశాల నుంచి సుందరీమణులు, పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో వారిని ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం చారిత్రక విశేషాలు ప్రపంచానికి తెలియజేసేందుకు లభించిన ఈ అవకాశాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్, ఉమ్మడి జిల్లా పర్యాటకశాఖ అధికారి శివాజీ, అసిస్టెంట్ టూరిజం ఆఫీసర్ సూర్యకిరణ్, కేంద్ర పురావస్తు అధికారి నవీన్, ఇరిగేషన్ అధికారులు, ఆర్ అండ్‌బీ అధికారులు, అటవీ, ఫైర్, వైద్య ఆరోగ్య, పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, మండల శాఖ అధికారులు, షో బోట్ ఈవెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కల్లంలో తడిసిన మిర్చి చూపుతున్న రైతులు

వాజేడులో వడగండ్ల వాన

వాజేడు, ఏప్రిల్ 23 : మండలంలోని చింతూరు గ్రామపంచాయతీలోని లక్ష్మీపురం, చింతూరు, ఆర్లగూడెంతోపాటు మరికొన్ని గ్రామాల్లో మంగళవారం రాత్రి వడగండ్ల వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంట తడిసి ముద్దయ్యింది. బుధవారం తడిసిన మిర్చిని ఆరబోస్తూ రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించి నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని బాధిత రైతులు కోరారు.

ఇసుక లారీ, ద్విచక్ర వాహనం ఢీ

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ఏటూరునాగారం, ఏప్రిల్ 23 : మండలంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకటాపురం మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన కల్లూరి రవి కిరణ్(32), మట్టి రవిశంకర్(35) ద్విచక్ర వాహనంపై మేడారం వెళ్లి వస్తున్నారు. కాగా, ఇదే క్రమంలో వాజేడు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఇసుక లారీ మండలంలోని జంపన్నవాగు రెండో బ్రిడ్జిపై ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవికిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. రవి శంకర్‌ను మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్ తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని సామాజిక వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ డ్రైవర్ అక్కడే లారీ వదిలేసి పారిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గురైన లారీ, ద్విచక్రవాహనంను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తాజుద్దిన్ తెలిపారు.

ఓపెన్ పరీక్షలో 19మంది డిబార్

ములుగురూరల్, ఏప్రిల్ 23 : ములుగు మండలంలోని బండారుపల్లి తెలంగాణ మోడల్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్ పరీక్ష కేంద్రంలో 19మంది అభ్యర్థులు డిబార్ అయినట్లు విద్యాశాఖ అధికారులు బుధవారం తెలిపారు. సదరు పరీక్ష కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పరీక్షను హైదరాబాద్ నుంచి వచ్చిన స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీలో 19మంది అభ్యర్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి వారిని మిగిలిన మూడు పరీక్షలకు డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

ఏటూరునాగారంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ములుగురూరల్/గోవిందరావుపేట /ఏటూరునాగారం/ కృష్ణకాలనీ, ఏప్రిల్ 23 : దక్షిణ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై, గోవిందరావుపేట పస్రాలో, ఏటూరునాగారం మండల కేంద్రంలో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేసి శాంతి ర్యాలీలు నిర్వహించారు. హిందువులను లక్ష్యంగా చేసుకొని ఇస్లామిక్ ఉగ్రవాదులు కాల్చి చంపడాన్ని ఖండిస్తున్నామన్నారు. అదేవిధంగా రా త్రి జాతీయ రహదారిపై పర్యాటకుల మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం, ఏడునూత నిషిధర్‌రెడ్డి, ములుగు మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, ములుగు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రాంబాబు, ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఎం సత్యనారాయణ, పల్లా బుచ్చయ్య, గాడిచర్ల రాజశేఖర్, కత్తెర శ్రీనివాస్, వినుకోలు చక్రవర్తి, కాశ్ర రామకృష్ణ, అలువాల శ్రీనివాస్, అటికె నాగేశ్వర్‌రావుపాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

సభకు ఉప్పెనలా తరలిరావాలి

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మల్హర్, ఏప్రిల్ 23 : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు తాజోద్దిన్ పిలుపునిచ్చారు. బుధవారం వల్లెకుంట గ్రామంలో రజతోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడుకును హత్య చేసిన తండ్రి అరెస్టు

నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ మల్లేశ్

రేగొండ, ఏప్రిల్ 23 : కుమారుడిని అతి కిరాతకంగా హత్య చేసిన తండ్రిని అరెస్టు చేసిరి మాండుకు పంపినట్లు చిట్యాల సీఐ మల్లేశ్ తెలిపారు. రేగొండ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రేగొండ మండలం రేపాకపల్లెకు చెందిన కాసం మొండయ్య కుమారుడు ఓదెలుకు పరకాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన దేవితో 14ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో మొండయ్య కోడలుపై అసభ్యంగా ప్రవర్తించడంతో తండ్రీ కొడుకుల మధ్య నిత్యం గొడవలు జరిగేవి. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా తండ్రీకొడుకుల మధ్య గొడవ జరిగిందన్నారు. దీంతో మంగళవారం ఇంట్లో నిద్రిస్తున్న ఓదెలును మొండయ్య రోకలి బండతో కొట్టి హత్య చేసి పరారైనట్లు తెలిపారు. తల్లి సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. రేగొండ ఎస్సై సందీప కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మొండయ్యను బుధవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ మల్లేశ్ తెలిపారు.

ఉన్నత చదువులతో జిల్లాకు పేరు తేవాలి

ఇంటర్ విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో మంత్రి సీతక్క

విద్యార్థిని ప్రణవిని సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ములుగురూరల్, ఏప్రిల్ 23 : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ములుగు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో రాష్ట్రంలో జిల్లాకు మొదటి స్థానంలో నిలిపిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ టీఎస్ దివాకర అధ్యక్షతన నిర్వహించారు. మంత్రి సీతక్క పాల్గొని విద్యార్థులను, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి చంద్రకళను శాలువాతో సత్కరించి అభినందించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, లెక్చరర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన పుట్ట మధు

వధూవరులను ఆశీర్వదిస్తున్న పుట్ట మధు

మహాముత్తారం, ఏప్రిల్ 23 : మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ బుధవారం పలు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని బోర్లగూడెం గ్రామంలో ముదురుకొల్ల ఉమ-రవి కూతురు స్నేహ–ఇసాక్, మీనాజీపేట గ్రామం లో తులసే రాజేశ్వరీ-రమేశ్‌పటేల్ కూతురు శ్రీవిద్య-సుధీర్ వివాహ వేడుకల్లో పుట్ట మధు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట యువజన రాష్ట్ర నాయకులు జక్కు రాకేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెల్మారెడ్డి అనిల్‌రెడ్డి, డైరెక్టర్ అజ్మీరా సుజాత, మండల మాజీ అధ్యక్షుడు మార్క రామునాయక్, మండల అధికార ప్రతినిధి బోడా బాలాజీనాయక్, ధరమ్‌సింగ్‌నాయక్, మాజీ ఎంపీపీ మెండ వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ, ఏప్రిల్ 23 : బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను గద్దె దించడమే లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం గోరికొత్తపల్లి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి, నిజాంపల్లి, కొత్తపల్లి, సుల్తాన్‌పూర్, కోనరావుపేట గ్రామాల్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయడంలో బీఆర్ఎస్ శ్రేణుల భాగస్వామ్యం గొప్పదన్నారు. బహిరంగ సభకు భారీగా ప్రజలను తరలించేందుకు కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని, రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయి సామాన్య ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి విదేశీ పర్యటనలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. సమావేశాల్లో మండల పార్టీ అధ్యక్షుడు హమీద్, నాయకులు శ్రీనివాస్, ధనుంజయ, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

'చిన్న కాళేశ్వరం' కెనాల్‌పై గ్రామసభ

మహదేవపూర్, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని రాపల్లికోట గ్రామంలో చిన్నకాళేశ్వరం ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ తవ్వకాల్లో భాగంగా చేపట్టనున్న భూసేకరణపై బుధవారం అధికారులు రైతులతో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కోల్పోతున్న భూముల వివరాలను అధికారులు రైతులకు చదివి వినిపించారు. వివరాల్లో పొరపాట్లు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఇరిగేషన్ శాఖ ఏఈఈ భరత్ ఆనంద్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి, జీపీ కార్యదర్శి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

సింగరేణి జనరల్ మజ్దూర్ల డిజిగ్నేషన్ మార్పు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 23 : సింగరేణి సంస్థలో జనరల్ మజ్దూర్‌ల డిజిగ్నేషన్ మార్పు చేస్తూ, జనరల్ అసిస్టెంట్‌గా గుర్తిస్తూ సింగరేణి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఏరియా అధికార ప్రతినిధి కే మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సంస్థలో కేటగిరి-1లో పని చేస్తున్న జనరల్ మజ్దూర్లను ఇకపై ఆ పేరుతో కాకుండా జనరల్ అసిస్టెంట్‌గా ప్రకటించింది. ఇటీవల జరిగిన జాతీయస్థాయి వేజ్‌బోర్డు ఒప్పందంలో ఈ పేరు మార్పునకు సంబంధించి తీసుకున్న నిర్ణయాన్ని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ తక్షణమే అమలు జరుపాలని ఆదేశించడంతో, ఈ మేరకు సర్క్యూలర్ జారీ చేశారు. దీంతో సంస్థలో 14వేల మంది జనరల్ మజ్దూర్లతోపాటు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులకు విద్యార్థుల పాదపూజ

మహదేవపూర్, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని సూరారం ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను గౌరవించాలని, క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులు కన్న కలలు సాకారం చేయాలని హెచ్ఎం పద్మ సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ

ఏటూరునాగారం, ఏప్రిల్ 23 : అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మాదిరి మధు, కార్యదర్శిగా వావిలాల కిశోర్, ఉపాధ్యక్షుడిగా బోయిరి శ్రీధర్, సహాయ కార్యదర్శిగా కందుకూరి రతన్, ప్రచార కార్యదర్శిగా దేపాక సాగర్, కోశాధికారిగా సాధనపల్లి రాజ్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా కర్రి రవికుమార్, గౌరవ సలహాదారులుగా గంపల శివకుమార్, గోగు మల్లయ్య, గోస్కుల రాంబాబు, కుమ్మరి చంద్రబాబు, ఎంపెల్లి రాజ్‌కుమార్, మాదిరి రాంబాబు, కొండగొర్ల పోషయ్యను ఎన్నుకున్నారు.

మోడల్ ఫలితాల్లో తల్లిదండ్రులకు నిరాశ

మహాముత్తారం, ఏప్రిల్ 23 : దొబ్బల పాడ్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ చదువుతున్న బాలబాలికల తల్లిదండ్రులకు రిజల్ట్ నిరాశ మిగిల్చింది. మండలంలోని దొబ్బలపాడ్ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమంలో 44మంది పరీక్షలు రాయగా 11మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 44మందికి ఏడుగురు ఉత్తీర్ణత సాధించారు. మునుపెన్నడూ లేని విధంగా ఉత్తీర్ణశాతం పడిపోయిందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఇంటర్‌లో పాస్ కాలేదని ఉరేసుకుని బలవన్మరణం

పలిమెల, ఏప్రిల్ 23 : మండలకేంద్రానికి అనుబంధ గ్రామమైన అప్పాజిపేట గ్రామానికి చెందిన జాడి సంజన(16) బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక ఎస్సై రమేశ్ తెలిపిన ప్రకారం.. అప్పాజిపేట గ్రామానికి చెందిన జాడి మధుసూదన్ పెద్ద కూతురు సంజన కాటారం మండలం గంగారం గ్రామంలోని మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం చదువుతున్నది. మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యింది. దీంతో సంజన మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంజన తండ్రి చూసి కిందకు దింపడంతో అప్పటికే మరణించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రమేశ్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మహదేవపూర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు. తండ్రి మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

చిట్యాల, ఏప్రిల్ 23 : వీధికుక్కల దాడిలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని జడలపేట గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రత్న రమేశ్ కూతురు నైనిషా ఇంటి వద్ద ఆడుకుంటుంది. ఈ క్రమంలో మూడు వీధి కుక్కలు చిన్నారిని వెంటాడి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు మండల కేంద్రంలోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

'భూభారతి'పై అవగాహన సదస్సు

మాట్లాడుతున్న కలెక్టర్

వాజేడు, ఏప్రిల్ 23 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి అమలుపై బుధవారం మండలకేంద్రంలోని రైతు వేదిక వద్ద కలెక్టర్ టీఎస్ దివాకర ఆధ్వర్యంలో రైతులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రైతులు తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

CHANGE OF NAME

★I, DORNALA VARUN S/o DORNALA VENKATA NARAYANA R/o H.No: 3-17/A, Near Susheela Degree College, Didugupadu, Madhira, Khammam, Telangana. I have changed my Father's name from DORNALA VENKAT NARAYANA to DORNALA VENKATA NARAYANA for all future purposes.
NTW-7710

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథపల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777135 MULUGU
9182777135 MAHABUBABAD
9182777557 JANGAON
9182777565

చైత్రను సత్కరిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

చైత్రకు ఏఎస్పీ సన్మానం

ఏటూరునాగారం, ఏప్రిల్ 23 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో అత్యధిక మార్కులు సాధించిన పెండ్యాల చైత్రను స్థానిక ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అభినందించారు. చైత్ర 470 మార్కులకుగాను 465 మార్కులు సాధించింది. విషయం తెలుసుకున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తన కార్యాలయంలో బుధవారం శాలువాతో సత్కరించారు. ఎస్సై తాజుద్దిన్, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, చైత్ర తండ్రి సతీశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎలుకటి రాజయ్య

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 23 : జిల్లాలోని చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లో అగ్నిమాపక కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, ప్రభుత్వం వెంటనే అగ్నిమాపక కేంద్రాన్ని